క్లుప్తంగా

ఘనంగా బంగారమ్మ వారాలు


పూజలందుకున్న బంగారమ్మ

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డులోని పిలకవానిపాలెం, పాత పీఎం పాలెం పరిసర గ్రామాల ఊరు పండగ వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్నందున మంగళవారం రాత్రి త్రిశక్తి ఆలయంలో బంగారమ్మ వారాలు ఘనంగా నిర్వహించారు. అర్ధ రాత్రి సమయంలో అమ్మవారి ఆలయానికి ఆయా గ్రామాలతోపాటు పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా చేరుకుని మొక్కులు చెల్లించుకుని పూజలు చేశారు. దీంతో కొమ్మాది కూడలి సందడిగా మారింది. అమ్మవారి ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలి


తిమ్మాపురంలో సిబ్బందికి సూచనలిస్తున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కొమ్మాది: బీచ్‌రోడ్డులో గల రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేలా శానిటరీ సిబ్బంది చూసుకోవాలని భీమిలి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సూచించారు. జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. నివాసాల మధ్య నీరు నిల్వ ఉంచరాదని, ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాడిసన్ బ్లూలో బిర్యానీ బజార్ ఫెస్ట్


వివరాలు తెలుపుతున్న ఎగ్జిక్యూటివ్ చెఫ్ జీవీ రమేష్

కొమ్మాది: రుషికొండలోని రాడిసన్ బ్లూరిసార్ట్‌లో ఈ నెల 19 నుంచి బిర్యానీ బజార్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల చివరి వరకు 28 రకాల బిర్యానీలతో పాటు పలు రకాల స్టార్టర్స్‌ను అందుబాటులో ఉంచనున్నట్లు ఎగ్జిక్యూటివ్ చెఫ్ జీవీ రమేష్ తెలిపారు. హైదరాబాద్ బిర్యానీ, నాటు కోడి బిర్యానీ, ఉలవచారు బిర్యానీ, పనస బిర్యానీ వంటి అనేక రకాలు అందుబాటు ధరలకే అందించనున్నట్లు తెలిపారు. డైరెక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


ఎస్‌కే చిన్న సాహెబ్

పీఎం పాలెం: తుమ్మిరి గెడ్డ మినీ రిజర్వాయర్‌లో మంగళవారం మధ్యాహ్నం ఈతకు దిగి గల్లంతైన షేక్ చిన్న సాహెబ్ (30) మృతదేహాన్ని పీఎంపాలెం పోలీసులు బుధవారం ఉదయం గుర్తించారు. పీఎం పాలెం ముస్లిం కాలనీలో భార్య బీబీ, నలుగురు పిల్లలతో షేక్ చిన్న సాహెబ్ నివసిస్తుండేవాడు. మధురవాడలోని మటన్ దుకాణంలో రోజువారీ కూలీగా పని చేస్తుంటాడు. అతని మృతితో భార్య, ముగ్గురు పిల్లలు దిక్కులేని వారయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి అతని భార్య బీబీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జెడ్సీ ఆదేశాలు బేఖాతర్


మరమ్మతులకు నోచుకోని సంతపేట చిల్డ్రన్స్ పార్కు గేటు

- చిల్డ్రన్స్ పార్కులో పనులు చేపట్టని సిబ్బంది

తగరపువలస: భీమిలి జోన్ పరిధిలో జెడ్సీ బి.రాము ఆదేశాలను జీవీఎంసీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. రెండో వార్డు సంతపేట చిల్డ్రన్స్ పార్కు ఆకతాయిలకు అడ్డాగా మారిపోవడంతో 'జులాయిలకు అడ్డాగా చిల్డ్రన్స్ పార్కు' శీర్షికతో ఈ నెల 10న సాక్షిలో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో అదే రోజు ఈ చిల్డ్రన్స్ పార్కును సందర్శించిన జెడ్సీ రాము రెండు రోజుల్లో గేటుకు మరమ్మతులు చేయించి బిల్లు సిద్ధం చేయాలని వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. పార్కు ఆవరణలో డెబ్రిస్ తొలగించే బాధ్యతను టౌన్‌ప్లానింగ్ సెక్రటరీకి, కూలిన ప్రహరీ పునరుద్ధరించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని డెబ్రిస్ వేసిన వారిని హెచ్చరించారు. ఇది జరిగి వారం రోజులు గడిచినప్పటికీ ఆయన ఆదేశాలు ఒక్కటి కూడా అమలు జరగలేదు. దీంతో స్థానికులు వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు మొరపెట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు చిల్డ్రన్స్ పార్కులో రక్షణ చర్యలు చేపట్టి ఆకతాయిల బెడద నియంత్రించాలని భీమిలి పోలీసులను కూడా ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.


పార్కులో తొలగించని డెబ్రిస్

బీచ్‌రోడ్‌లో జంక్షన్ల అభివృద్ధిపై దృష్టి

కొమ్మాది: బీచ్‌రోడ్‌లోని ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. పర్యాటక ప్రాంతాలైన రుషికొండ బీచ్, సాగర్‌నగర్ బీచ్, గుడ్లవానిపాలెం మూడు గుళ్ల ప్రాంతాలను బుధవారం ఆయన సందర్శించారు. గతంలో సుందరీకరణలో భాగంగా నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాగర్‌నగర్ బీచ్ వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్స్‌కు తాళం వేసి ఉండడాన్ని గమనించిన ఆయన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇక్కడకు వస్తున్న పర్యాటకులు వ్యర్థాలను ఇక్కడే పడేయకుండా పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆయనవెంట చీఫ్ ఇంజినీరు రవికృష్ణ రాజు, సిటీ ప్లానర్ డి.సురేష్ కుమార్, పర్యవేక్షణ ఇంజినీరు రవి తదితరులు ఉన్నారు.


సాగర్‌నగర్ బీచ్‌లో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

అవసరం మేరకు వినియోగిస్తే విద్యుత్ ఆదా

- మధురవాడలో మరో విద్యుత్ సబ్ స్టేషన్
- డీఈఈ పోలాకి శ్రీనివాసరావు

మధురవాడ: వేసవి ఎండలు విపరీతంగా మండిపోతున్న నేపథ్యంలో వినియోగదారులు విద్యుత్ పొదుపు పాటించడం చాలా అవసరమని విశాఖ జోన్ – 3 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొద్ది రోజులుగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం చాలా చోట్ల సరిపోవడం లేదని, ఓవర్ లోడ్ అవుతున్నాయని చెప్పారు. అవసరం మేరకే విద్యుత్ వినియోగించాలని, ఏసీలు వంటివి తప్పనిసరి అయితేనే వాడాలని సూచించారు. అవసరం తీరిపోయిన వెంటనే ఫ్యాన్‌లు, లైట్లు ఆపేయడం వల్ల కరెంటు బిల్లు తగ్గడంతో పాటు, విద్యుత్ కూడా ఆదా అవుతుందన్నారు. వినియోగదారుల సహకారం ప్రస్తుతం చాలా అవసరమన్నారు. సరఫరాలో ఏదైనా సమస్య తలెత్తితే తక్షణమే తెలియజేస్తే చర్యలు చేపడతామని తెలిపారు.

11 గంటల్లోపే నిర్వహణ పనులు


పోలాకి శ్రీనివాసరావు

ఎండ వేడిమి తక్కువ ఉన్న సమయంలో ముఖ్యంగా ఉదయం 6 గంటల నుంచి 11 మధ్యనే నిర్వహణ, అత్యవసర మరమ్మతులు చేపట్టాలని కింది స్థాయి అధికారులు, సిబ్బందిని డీఈఈ పోలాకి శ్రీనివాసరావు ఆదేశించారు. సిబ్బందిని సబ్ స్టేషన్లలో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. సమస్య వచ్చిన వెంటనే చర్యలు చేపట్టేలా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మధురవాడ ప్రాంతంలో పెరుగుతున్న జనాభా, అవసరాలు నేపథ్యంలో మరింత నాణ్యమైన విద్యుత్ ప్రజలకు అందించాలంటే మరొక సబ్ స్టేషన్ అవసరం ఉందని చెప్పారు. దీని కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచనల మేరకు దీనిని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

టెలీ కమ్యూనికేషన్‌లో విప్లవాత్మక మార్పులు

తగరపువలస: ఇటీవల టెలీ కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని బీఎస్‌ఎన్‌ఎల్ విశాఖ జనరల్ మేనేజర్ సీహెచ్.శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ టెలీ కమ్యూనికేషన్ దినోత్సవం సందర్భంగా భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులుతోపాటు నిపుణులు తమ అనుభవాలు పంచుకుంటూ కీలక ప్రసంగాలు చేశారు. భవిష్యత్‌లో ఈ రంగంలో మరిన్ని మార్పులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.


బీఎస్ఎన్ఎల్ మేనేజర్ శ్రీనివాసులును సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

అసభ్యంగా ప్రవర్తించిన డ్రైవర్‌పై కేసు

భీమునిపట్నం: భీమిలి జోన్ పరిధిలో పని చేస్తున్న మహిళ సంఘానికి సంబంధించిన రిసోర్స్ పర్సన్ (ఆర్‌పీ)పట్ల అసభ్యంగా ప్రవర్తించిన డ్రైవర్‌పై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళ సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారి ఇళ్లకు వెళ్లి ఆర్‌పీలు చెత్త పన్ను వసూలు చేస్తారు. ఈ క్రమంలో ఈ నెల 12న మామిడిపాలెం వద్ద ఉప్పాడ ఆదిలక్ష్మి అనే ఆర్‌పీ పన్ను చెల్లించాలని మహిళ సంఘ సభ్యురాలి ఇంటికి వెళ్లి అడగ్గా ఆమె భర్త సీహెచ్.త్రినాథ్ తాను చెత్త సేకరించే క్లాప్ వాహన డ్రైవర్‌నని, పన్ను చెల్లించనని దుర్భాషలాడడంతోపాటు, ఆమెతో అసభ్యంగా ప్రవర్తించారు. దీనిపై ఆదిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ లక్ష్మణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనిషి జీవితంలో కామెడీ పాత్ర కీలకం

ఎంవీపీ కాలనీ: మనిషి జీవితంలో కామెడీ పాత్ర కీలకమని బాల వికాష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు అన్నారు. బాల వికాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హాస్యప్రియ కామెడీ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న కామెడీ వర్క్‌షాపును బుధవారం ఆయన ప్రారంభించారు. కామెడీని ఆస్వాదించడం ద్వారా మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. హాస్యప్రియ కామెడీ క్లబ్ కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ అందరికీ మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం కల్పించే లక్ష్యంతో ఈ వర్క్‌షాపు ద్వారా కామెడీ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఎంవీపీకాలనీలోని వీఎంసీ కళాశాలలో జరుగుతున్న ఈ వర్క్‌షాప్ ఈ నెల 19 వరకు కొనసాగుతుందన్నారు. తొలి రోజు వర్క్‌షాపునకు 23 మంది హాజరైనట్లు తెలిపారు. డాక్టర్ అప్పారావు, సాయికుమార్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

జీవో 84పై అవగాహన

మురళీనగర్ : నగరంలోని యూఎల్‌సీ భూముల్లో భవనాలు నిర్మించుకుని నివసిస్తున్న వారితో పాటు ఖాళీ స్థలాల్లో డీ పట్టాల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 84పై ఆర్డీవో హుస్సేన్ అవగాహన కల్పించారు. 49, 50 వార్డులకు సంబంధించి సత్యనగర్–1లో స్థానికులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ సమక్షంలో ఆయన స్థానికులకు వివరాలు తెలియజేశారు. 150 గజాల వరకు డీపట్టా ఉచితంగా అందిస్తామన్నారు. 151 నుంచి మూడు 300 గజాల వరకు మార్కెట్ విలువపై 15 శాతం, 301 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 దాటితే వంద శాతం మార్కెట్ విలువ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి సర్వే జరుగుతుందని తెలిపారు. గోపాలపట్నం తహసీల్దార్, స్థానిక వీఆర్వో పాల్గొన్నారు.


జీవో 84పై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో హుస్సేన్

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని చంద్రంపాలెం ఫీడర్‌లో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఈ మేరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు చంద్రంపాలెం, మధురవాడ మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.55 వేలతో మోటారు వితరణ

పద్మనాభం: మండలంలోని కొత్త కొవ్వాడ ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు తన సొంత నిధులు రూ.55 వేలతో మోటారు ఏర్పాటు చేశారు. గతంలో గిరిబాబు సొంత నిధులు రూ.55 వేలతో తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యుత్ బోరు వేయించారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకుడు కోన వెంకట బాల సింహాచలం, సర్పంచ్ పి.రత్నం, కొత్త కొవ్వాడ ఎస్సీ కాలనీ వాసులు గిరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

బస్ షెల్టర్లు నిర్మించండి

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో ప్రధాన వాణిజ్య కేంద్రమైన తగరపువలసలో బస్ షెల్టర్లు నిర్మించాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి పిట్టా సురేష్ డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ఎక్కడా నీడ లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నా జీవీఎంసీ గ్రీన్‌షెల్టర్లు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. భీమిలి నియోజకవర్గ ప్రజలందరి ఆకాంక్ష మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించాలని ఆయన కోరారు.

ద్విచక్ర వాహనం చోరీ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని బుధవారం వేకువజామున 3.15 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. శీల శంకర్ అనే వ్యక్తి ఇంటి ముందు ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఓ వ్యక్తి అపహరించినట్లు సీసీ కెమెరాలో రికార్డయింది. దీంతో బాధితుని ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన పైడితల్లమ్మ ఉత్సవాలు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న పైడితల్లమ్మ ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. అమ్మవారి ఆలయాన్ని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం విపరీతంగా ద్విచక్ర వాహనాలు, కార్లు గ్రామంలోకి ప్రవేశించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆటో కార్మికులు సహకరించాలి

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి వంటి మత్తుపదార్థాల రవాణా ఎక్కువగా ఉన్నందున వాటిని అరికట్టేందుకు ఆటో కార్మికులు తమతో సహకరించాలని సీఐ కె.లక్ష్మణమూర్తి కోరారు. బుధవారం సాయంత్రం స్థానిక ప్రధాన రహదారిపై రాములమ్మ థియేటర్ వద్ద ఆయన ఆటో కార్మికులతో మాట్లాడారు. మత్తు పదార్థాల రవాణాను ఆటో కార్మికులు ప్రోత్సహించకూడదన్నారు. అలాంటి సమాచారం తెలిస్తే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. ఆటోల్లో మత్తు పదార్థాలు దొరికితే వాటి డ్రైవర్లు, యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐ గంటా హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి యువకుడి మృతి

ఎంవీపీకాలనీ: మద్యం మత్తులో భవనంపై నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఒడిశాకు చెందిన విజ్జు (26) నగరంలోని ఓ హోటల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన పలువురు యువకులతో కలిసి ఎంవీపీకాలనీ సెక్టార్–9లోని ఓ ఇంట్లోని రెండవ అంతస్తులో అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం పనికి వెళ్లని విజ్జు మధ్యాహ్నం నుంచి మద్యం తాగుతూ ఉన్నాడు. మంగళవారం అర్ధరాత్రి మద్యం మత్తులో బయటకు వచ్చిన విజ్జు.. అదుపు తప్పి రెండో అంతస్తు నుంచి కింద పడిపోయాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని తోటి యువకులు పోలీసులకు సమాచారం అందించడంతో.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.


విజ్జు మృతదేహం

గురుస్వామి ఆకెళ్ల ఆశయాలు కొనసాగించండి

- ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి


మాట్లాడుతున్న ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి

తగరపువలస: గురుస్వామి ఆకెళ్ల నరసింహమూర్తి ఆశయాల సాధనకు ఆయన శిష్యులు కలిసి పనిచేయాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి కోరారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయ ఆవరణలో ఆకెళ్ల సంతాపసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసానంద మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో అయ్యప్పస్వామి భక్తునిగా 40 ఏళ్లుగా లక్షలాది మందిని పూజలు, గాత్రంతో ఆకెళ్ల అలరించారన్నారు. ఈ ప్రాంత ప్రజల రక్షణ కోసం పంచముఖ ఆంజనేయుడు, షిర్డీ సాయిబాబా, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలు ప్రతిష్ఠించారన్నారు. నాలుగేళ్లుగా ప్రతి గురువారం అన్నదానం నిర్వహించారన్నారు. అలాంటి మహనీయుడు తక్కువ వయసులోనే అందరికీ దూరం కావడం బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, టీడీపీ భీమిలి, నెల్లిమర్ల ఇన్‌చార్జులు కోరాడ రాజబాబు, కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ గురుస్వామి శిష్యుల కోరిక మేరకు ఆయన కుమారులు భాగ్యరాజ్, రవిగణేష్ పూజలు, వ్రతాలు, పీఠంలో దీక్షలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆదిమూలం నాగరాజు, మాల్యాద్రి, నాయకులు మహంతి శ్రీను, గాడు శ్రీను, బంక సత్యం, జీరు వెంకటరెడ్డి, పిట్ట సురేష్, కరుభుక్త అప్పలనారాయణ, తమ్మిన రామలక్ష్మణ, తమ్మిన రాము, కళిరెడ్డి దామోదరరావు, డీఏఎస్ రాజు, చిల్ల గణేష్‌రెడ్డి, వెంపాడ శ్రీనివాసరెడ్డి, పిల్లా రాజేష్, పంచకర్ల సందీప్, పరిమి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, ఉపాధ్యాయులు

పద్మనాభం: 'నాడు – నేడు' పథకంతో ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మౌలిక సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపి పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు అన్నారు. పదో తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన 45 మంది విద్యార్థులను మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఘనంగా సత్కరించి మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు లేవన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం జగన్ సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన 45 మంది 500కు పైగా మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. ఇతర విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రతిభ చూపిన విద్యార్థుల ఫొటోలతో ఫ్లెక్సీలను అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాల్లో పెట్టాలన్నారు.

పద్మనాభంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం విద్యార్థిని జశ్వంతి మండల టాపర్‌గా నిలవడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులను రాంబాబు, గిరిబాబు, ఉపాధ్యాయులు సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, తహసీల్దార్ టి.శ్రీవల్లి, ఎంఈవో ఎం.శివరాణి, ఎం.వి.కృష్ణకుమార్, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎ.అరుణ్‌కుమార్, ఆర్.జగదీష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా సుత్తమ్మతల్లి వారోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లి


భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న యువకులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ, మూలకుద్దు పంచాయతీవాసుల గ్రామదేవత సుత్తమ్మతల్లి వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. 14 గ్రామాల భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పసుపు, కుంకుమ సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజామున 2 గంటలకు అమ్మవారికి అభిషేకం, మంగళహారతి సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించడానికి చిప్పాడ హైటెక్ యూత్, ఆర్మీ యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేశారు. కొత్త మూలకుద్దు ఆలయం వద్ద కూడా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించారు.

120 మందికి కంటి వైద్య పరీక్షలు

తగరపువలస: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేటలో ఉచిత నేత్ర వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. 3వ విడత శిబిరంలో భాగంగా 120 మందికి పరీక్షలు నిర్వహించి 27 మందికి కళ్లద్దాలు అందజేశారు. 10 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. డాక్టర్ కె.భవాని ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, సీనియర్ నాయకులు బింగి హరికిరణ్ రెడ్డి, మునకాల ఆదినారాయణ రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, చిల్ల సూరి నరసయ్యరెడ్డి, నేదురి శ్రీనివాస రెడ్డి, రౌతు రామురెడ్డి, డెక్కతి శ్రీనివాసరెడ్డి, చిల్ల సూరిబాబు, చిల్ల గోపిరెడ్డి, చిల్ల సూర్యంరెడ్డి, ఎం.త్రినాథ్‌రెడ్డి, మునకాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


చిల్లపేటలో కంటి వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది

ఇనాం భూముల రైతుల ఆందోళన

తగరపువలస: భీమిలి మండలం నారాయణరాజుపేట పంచాయతీలో ఇనాం భూములు విక్రయించారని ఆరోపిస్తూ సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు ఆధ్వర్యంలో రైతులు బుధవారం ఆందోళన చేశారు. ఏళ్ల తరబడి సాగులో ఉంటూ బ్యాంకుల నుంచి రుణాలు, ప్రభుత్వం నుంచి సబ్సిడీలు తీసుకుంటున్న రైతులను కాదని భూములు విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళన చేపట్టారు. ఫారం – 8ను ఆసరాగా చేసుకుని మూడేళ్ల క్రితం ఒప్పందం చేసుకుని రెండు నెలల క్రితం జీపీ చేయడం సరికాదన్నారు. 450 మంది రైతులకు సంబంధించిన వందలాది ఎకరాల భూ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కోరారు. కాగా వైఎస్సార్‌సీపీ నాయకులు జోక్యం చేసుకుని తమ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్థానికంగా ఉండగా ఈ సమస్యలో ఎక్కడి నుంచో వచ్చిన వ్యక్తుల జోక్యం తగదని ఆందోళనకు దూరంగా ఉన్నారు.